


## అనుకూలమైన ప్రదేశం

(మొదటిపేజీ తరువాయి)

నన్ను అడిగారు. విశాఖలో ఓ మెగా షాపింగ్ మాల్ నిర్మిస్తామని ప్రతిపాదించా. కొన్ని అనుకోని కారణాల వల్ల ఆ మెగా షాపింగ్ మాల్ నిర్మాణం ఆగిపోయింది. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక మేం రాష్ట్రాన్ని సందర్శించి తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందడుగు వేశాం. విశాఖలో మా మెగా షాపింగ్ మాల్ నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం.- యూసుఫ్ అలీ, లులు సీఎండీ

యూఏఈకి కీలక భాగస్వామిగా ఏపీ: యూఏఈకి ఏపీ నమ్మకమైన భాగస్వామి అని యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రి అన్నారు. భారత్, యూఏఈ ఎకనామిక్ కారిడార్‌లో ఏపీ కీలక భాగస్వామిగా మారుతుందని ఆకాంక్షించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పచ్చదనం, అందమైన నదులు, సుందరమైన తీరం, మౌలిక సదుపాయాలు అబ్బురపరిచాయి. మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిరతపై ఏపీ, యూఏఈ సంయుక్తంగా పనిచేయాలి. ఇన్వెస్టోపియా ద్వారా వీలైనన్ని ఎక్కువ పెట్టుబడులు రాబట్టడమే మా లక్ష్యం. ఏపీతో భాగస్వామ్యం బలంగా కొనసాగేందుకు కట్టుబడి ఉన్నాం. భారత్-యూఏఈ ఆర్థిక కారిడార్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక భాగస్వామిగా నిలుస్తుందన్న విశ్వాసం మాకు ఉంది.- అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రి, యుఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి

45 శాతం రాయితీ: ఆంధ్రప్రదేశ్‌లోని విస్తృతమైన మౌలిక సదుపాయాలను పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. యూఏఈకి నమ్మకమైన భాగస్వామిగా ఏపీ ఉంటుందన్నారు.

ఏపీ పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిలో దాదాపు 45 శాతం రాయితీ ఇస్తున్నాం. 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేయడం ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఏపీ తొలిస్థానంలో కొనసాగుతోంది. దేశంలోనే అత్యంత నైపుణ్యం కలిగిన యువత ఏపీ సొంతం. రాష్ట్రంలోని అనుకూల వాతావరణాన్ని వినియోగించుకొని ఆహారం, ఆర్థిక రంగాల్లో పరస్పర వృద్ధి సాధిద్దామని యూఏఈ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నా.- టి.జి. భరత్, మంత్రి

## ఎన్నిక ప్రక్రియ ప్రారంభించిన ఈసీ

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేయడానికి ఉండదు. ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి 5 ఏళ్లు పదవిలో ఉంటారు. పదవీ కాలపరిమితి పూర్తయిన ఉపరాష్ట్రపతి, కొత్తగా ఎన్నికైన ఉపరాష్ట్రపతి బాధ్యతలు స్వీకరించే వరకు పదవిలో ఉంటారు.

ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేయడానికి అర్హతలు

భారతీయ పౌరుడై ఉండాలి. 35 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. రాజ్యసభకు ఎన్నిక అయ్యేందుకు అవసరమైన అర్హతలు ఉండాలి. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల్లో ఆదాయం పొందే ప్రభుత్వ ఉద్యోగంలో ఉండకూడదు. ఒకవేళ ఉద్యోగి అయితే దానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. చట్టసభల్లో (పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ) సభ్యుడై ఉండకూడదు. ఒకవేళ చట్ట సభలో సభ్యుడైతే ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత ఆ చట్టసభ సభ్యత్వం కోల్పోతారు.

## పార్లమెంట్‌లో చర్చ

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామా చేసిన తర్వాత జరిగిన రాజ్యసభ తొలి బీఏసీ సమావేశం ఇది. ఎందుకంటే ధన్‌ఖడ్ ఇది వరకే 2 బీఏసీ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ఇప్పుడు మూడోది ఆయన లేకుండానే జరిగింది. ఎందుకంటే ఉపరాష్ట్రపతి రాజ్యసభకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

## అతలాకుతలం

(మొదటిపేజీ తరువాయి)

నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుకున్న నేపథ్యంలో పైనుంచి భారీగా వరదనీరు చేరుకోవడంతో నీటిని దిగువ ప్రాంతాలకు వదిలే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇలాగే ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే ఇసి, మూసి నదులలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. జలాశయాల దిగువ ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

తాలిపేరు ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తివేత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండల పరిధిలోని తాలిపేరు మధ్యంతర ప్రాజెక్టుకు బుధవారం భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు 15 గేట్లు ఎత్తి 28 వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి విడుదల చేస్తున్నారు.ఎ గువ ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద పోటెత్తింది. తాలిపేరుతో పాటు చింతవాగు, పగిడివాగు, రోటెంత వాగు, రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జలాశయానికి ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరుతోంది. తాలిపేరు ప్రాజెక్టు నుండి వరద పరవళ్లు తొక్కుతుండడంతో తేగడ వద్ద లోలెవల్ చప్టా నీటమునిగింది. వరద పరిస్థితిని ఏఈ సంపత్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పక్షాన ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తుందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఆడబిడ్డల బస్సు చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే ఆర్టిసి చెల్లిస్తుందని అన్నారు. ఆర్టిసిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కొత్త కొత్త విధానాలు తీసుకురావడం మూలంగా ఆదాయం పెరగడం అభినందనీయమన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2,400 కొత్త బస్సులు కొనుగోలు చేసిందన్నారు. ఒకప్పుడు ఆర్టిసి ఆక్యూపెన్సి రేషియో 60 శాతంగా ఉంటే మహాలక్ష్మి పథకం ద్వారా అది 97 శాతానికి పెరిగిందని చెప్పారు. హైదరాబాదును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగరంలో ఉన్న డీజిల్ బస్సులను హైదరాబాద్ నగరం బయటికి దశలవారీగా షిఫ్ట్ చేస్తున్నామన్నారు. నగరంలో ఉన్న బస్సుల్లో 11 శాతం బ్యాటరీ బస్సులను అందుబాటులోకి తీసుకురాగా, మూడు వేల బ్యాటరీ బస్సులను ఆర్డర్ ఇవ్వగా మరో 500 బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని వెల్లడించారు. ఇటీవలే బస్సుల అద్దెలకు సంబంధించిన కోటి రూపాయల నగదును నా ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించారని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలోపే ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించామని, ఈ పథకాన్ని విజయవంతం చేసిన ఆర్టిసి డ్రైవర్లు, కండక్టర్లు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టిసి ఎండి వి.సి.సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం కాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవని, గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఈ గ్రామాలను గాలికి వదిలేసిందన్నారు. ప్రయోగా త్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది), ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగు మడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాల్లో డ్రోన్ / ఏరియల్, ప్యూర్ గ్రౌండ్ ట్రూ తింగ్ రోవర్ పద్ధతుల్లో సర్వే నిర్వహించామని వివరించారు. నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీసుల జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించి యజమానుల అభ్యంత రాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి ఒక్కరి భూములకూ సర్వే హద్దులను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ఐదు గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా నక్షా మ్యాప్ ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా సామాన్య ప్రజలు, రైతుల సంతోషమే ప్రధానమని అన్నారు. భూముల అమ్మకం, కొనుగోలు సందర్భంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్‌ను ఖచ్చితంగా జత పరచాలని, అలాగే దేశంలో ప్రతి పౌరుడికీ ఆధార్ నెంబర్ తరహా భూములకు కూడా భూదార్ నెంబర్ కేటాయించాలని భూభారతి చట్టంలో స్పష్టం చేసిన విషయాన్ని పొంగులేటి గుర్తు చేశారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, ఐదు గ్రామాలకు చెందిన ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, సర్వేల్యాండ్ సెటిల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వే నిర్వహించిన ఏజన్సీల ప్రతి నిధులు పాల్గొన్నారు.

## కృతనిశ్చయంతో ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నామని సిఎం స్పష్టం చేశారు. హైకోర్టు సైతం సెప్టెంబరు నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో జులై నెలాఖరులోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించిందన్నారు. బిసి రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లుల ఆమోదానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేలను గురువారం ఉదయం కలిసి తెలంగాణ ప్రభత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ మరియు కుల సర్వే (ఎస్‌ఈఈఈఈపిసి) జరిపిన తీరు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలను వివరిస్తామని తెలిపారు. సాయంత్రం కాంగ్రెస్ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఈ అంశాన్ని వివరిస్తామని సిఎం వెల్లడించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే తెలంగాణ ప్రభుత్వం చేసిన రెండు బిల్లుల ఆమోదానికి పట్టుపడతామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ మరియు కుల సర్వే ప్రక్రియను 2024 ఫిబ్రవరి 4న మొదలు పెట్టి 2025 ఫిబ్రవరి 4వ తేదీ నాటికి పూర్తి చేసి శాసనసభలోనూ ఆమోదించామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే తెలంగాణలో ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా (సోషల్ జస్టిస్ డే) జరుపుతున్నామని తెలిపారు. సర్వే వివరాలను స్వతంత్ర నిపుణుల సలహా కమిటీకి ఇచ్చామని, వారు దానిపై చర్చించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ నివేదికను మంత్రివర్గంలో చర్చించి శాసనసభలో ప్రవేశపెడతామని వెల్లడించారు. సర్వే చేసినప్పటికీ వ్యక్తిగత వివరాలు వెల్లడించకూదని, అది వ్యక్తిగత డేటా ప్రైవసీ యాక్ట్ విరుద్ధమని సిఎం ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసే విషయాన్ని తీవ్రంగానే పరిశీలిస్తున్నామని మరో ప్రశ్నకు సిఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. కుల గణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కుల గణన చేపట్టమని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించిన బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టాక తమను అనుసరిస్తూ కుల గణనకు గెజిట్ విడుదల చేసిందన్నారు. తెలంగాణ వేసిన రోడ్ మ్యాప్‌ను దేశవ్యాప్తంగా కుల గణన సేకరణకు కేంద్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని సిఎం సూచించారు. రానున్న 2029 లోక్‌సభ ఎన్నికలు ఓబిసి రిజర్వేషన్లకు లిట్మస్ టెస్ట్‌లా నిలుస్తాయని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు బిల్లుల రద్దు విషయంలోనూ తొలుత మొండికేసిన బిజెపి ప్రభుత్వాన్ని మెడలు వంచి రద్దు చేయించామని, కుల గణన విషయంలో తమ మార్గంలో నడిచేలా చేశామని సిఎం తెలిపారు. ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతోనే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి అంశం పక్కకు పోయిందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

ఉప రాష్ట్రపతి పదవి తెలంగాణకు ఇవ్వాలి

ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామాకు కారణాలేమిటో తనకు తెలియదని, కానీ ఆ రాజీనామా దురదృష్టకరమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉప రాష్ట్రపతి పదవిని ఈ దఫా తెలంగాణకు ఇవ్వాలని సిఎండిమాండ్ చేశారు. ఉప రాష్ట్రపతిగా ఉన్న తెలుగు వ్యక్తి వెంకయ్య నాయుడును రాష్ట్రపతి కాకుండా ఇంటికి పంపించారని, సికింద్రాబాద్ నుంచి గెలిచి కేంద్ర మంత్రిగా ఉన్న బిసి నేత దత్తాత్రేయను గవర్నర్‌గా పంపి ఆ పదవిని కిషన్‌రెడ్డికి ఇచ్చారని సిఎం అన్నారు. బిసి నేతగా ఉన్న సంజయ్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించి కిషన్‌రెడ్డికి, ఆయన తర్వాత రాంచందర్‌రావుకు ఇచ్చారని, బిజెపి బిసిలకు అన్యాయం చేసిందని సిఎం విమర్శించారు. దత్తాత్రేయ గవర్నర్ పదవీ కాలం కూడా ముగిసిపోయిందని, బిసిలకు చేసిన ఈ అన్యాయాన్ని సరిచేసుకునేందుకు దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇస్తే బాగుంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నికలో అంతిమ నిర్ణయం కాంగ్రెస్ అధిష్టానానిదేనని, తనకు అవకాశం ఉంటే దత్తాత్రేయకు మద్దతు ఇచ్చే విషయంలో ప్రయత్నం చేస్తానని సిఎం ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాలరావు, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరాం నాయక్, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, డాక్టర్ కడియం కావ్య, సురేశ్ షెట్కార్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం


**విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ**

**వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని,రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ నేడు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాపిత పాఠశాలు,జూనియర్ కళాశాలల బంద్ విజయవంతం అయిందని, కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇప్పటికీ విద్యారంగంపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు ఆరోపించారు.బంద్ సందర్భంగా హిమాయత్ నగర్ లోని ప్రభుత్వ పాఠశాల,కాచిగూడా లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థుల తరగతులను బహిష్కరించి, నినాదాలు చేస్తూ బంద్ ను విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అనేక సంవత్సరాలుగా విద్యార్థి, యువజన సంఘాలు పోరాటాలు చేస్తున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోకడం వల్లనే విద్యారంగం కుంటుపడిందని,దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవివేకమని వారు ఆరోపించారు.అదే విధంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ,ఎంఇఓ, డీఈఓ, తదితర పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ కళాశాలల్లో అవినీతిని, గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న 8వేల కోట్ల రూపాయల విద్యార్థుల ఉపకార వేతన బకాయిలను, బోధనా రుసుములను లను విడుదల చేయాలని,రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించి,నిధులు కేటాయించాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్ పాస్ సౌకర్యాన్ని కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట ఉద్యోగ క్యాలెండర్ ను విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, యూత్ డిక్లరేషన్ ను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మహమూద్, వంశీ, అరుణ్, చెట్టుకింది శ్రీనివాస్, పాల్గొన్నారు.

## తెలుగులో విజ్ఞానజ్యోతి





తెలుగులో మొట్టమొదటి జనరల్ నాలెడ్జ పుస్తకాన్ని 1970 దశకం ప్రారంభంలో ఒక విద్యార్థి ప్రచురించాడంటే ఆశ్చర్యంగా ఉందికదూ. దక్షిణాదిలో జనరల్ నాలెడ్జ్ ప్రచురణ మొదట మలయాళ మనోరమలో వచ్చింది.తరువాత ఉమ్మడి ఏపీలో ఉభయ కమ్యూనిస్టు ఆధ్వర్యంలో వచ్చిన దేశదర్శని వార్షిక సంచికలో వచ్చింది. అనంతరం తెలుగులో వేల్పుల ఆనంద్ అనే విద్యార్థి జనరల్ నాలెడ్డ్ బిట్లు సేకరించి విజ్ఞానజ్యోతి పేర నవల సైజు పుస్తకం విజయవాడలో ప్రచురించాడు. వాటిని ఆ రోజుల్లో ఆరవై పైసలుగా ధర పెట్టాడు. దాన్ని పాఠశాల విద్యార్థులకు,పోటీ పరిక్షలు రాసేవారికీ అమ్మాడు. ఆ తరువాత 1975 లో డిగ్రీ చదువుతూ స్నేహితుల సహాయంతో రూ.400 పెట్టుబడితో వెయ్యి కాపీలు ప్రచురించాడు. ఆ పుస్తకం ముందుమాట ఎస్ఆర్ఆర్ కాలేజి ప్రిన్సిపాల్ హనుమా రెడ్డి గారు ఆనంద్ ను ప్రశంసిస్తూ రాయడం గొప్ప విషయం.పుస్తకం ప్రచురణకు అయ్యే డబ్బు తోటి క్లాస్ మేట్ రామారావు ఇచ్చాడు.అవి వాడి నాయనమ్మ వి. విజయవాడ సూర్యారావు పేటలో

ఆంధ్రాబ్యాంక్ బ్రాంచిలో రామారావు పేర దాచుకునేది. రామారావు ఇంటర్ బందర్ లో చదివాడు.బందరు పక్కన పల్లెలో వాళ్ల తాతయ్య, నాయనమ్మ ఉండేవారు. ఆవిడకు విశ్వనాథపల్లె లో తండ్రి నుంచి వచ్చిన పొలం ఉండేది. దాని నుంచి ప్రతి ఏడాది సుమారు రూ.500లోపు ఆదాయం వచ్చేది. దాన్ని తన కావిడి పెట్టెలో దాచుకునేది.ఒంటరిగా ఉంటున్నది కనుక , దొంగల భయంతో వాటిలో 400 రూపాయలు మనవడు రామారావు అకౌంట్ లో వేసి కావలసినప్పుడు తీసుకునేది. ఆ విషయం తెలిసిన ఆనంద్ పుస్తకాలకు పెట్టుబడి ఆ డబ్బు పెడితే నెలలో తిరిగి ఇస్తానని చెప్పాడు. డబ్బు ఒక్కసారిగా వాళ్ల నాయనమ్మ తీసుకోదు కనుక రామారావు స్నేహితునికి ధైర్యంగా ఇచ్చాడు.నెలలో ప్రింటింగ్ పూర్తి అయి పుస్తకం బయటకు వచ్చింది.వాళ్లకు కాలేజీ ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం వరకే ఉండేది. వాళ్ల గ్యాంగ్ వాటిని సైకిల్ మీద గుణదల,ఇతర పాఠశాలలు తిరిగి విద్యార్థులకు తక్కువధరకు పంపిణి చేసేవారు.దాంతో అనుకున్న సమయాన్ని ముందుగానే డబ్బులు వసూలయ్యాయి. అలా వాడు ఆర్థికంగా తేరుకుని కాలేజీ చదువు కొనసాగించాడు. ఆ తరువాత అనేక సార్లు విజ్ఞాన జ్యోతి పుస్తకాన్ని మరింత మెరుగులు దిద్ది ప్రచురించాడు.డిగ్రీ పూర్తి అయ్యే సరికి ఆనంద్ స్నేహితులు చాలా మంది ఈ వ్యాపారంలో వచ్చారు. భవిష్యత్ లో ఆనంద్, మండలి నర్సిగాడు,రెడ్డిగాడు,మధు తదితరులు చాలా సంవత్సరాలు పుస్తకాలు ప్రచురించి రాష్ట్రంలోని అన్ని హైస్కూల్స్ కు వెళ్లి పిల్లలకు చౌకగా విక్రయించేవారు.ఆ తరువాత బిట్ బ్యాంక్, ఇంగ్లీష్ గ్రామర్, వృత్తిపనుల మూడు భాషల పదకోశం వంటివి ఆనంద్ తయారు చేసి ఎంతో మంది పిల్లలకు విజ్ఞానం కలిగించాడు. అలా దాదాపు 30 సంవత్సరాలు ఇలా పిల్లలకు చౌకగా పుస్తకాలు విక్రయించేవాడు.విజయవాడలో వాడి పుస్తకం ప్రచురించని ప్రెస్ లేదంటే అతిశయోక్తి కాదు.2012 వరకూ ఆనంద్ ప్రచురణ కొనసాగింది.ఆ తరువాత అతని పిల్లలు ఉన్నత విద్య అభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడడంతో పుస్తక ప్రచురణ,అమ్మడం మానివేసాడు. అయినా అతను చూపిన దారిలో నేటికీ ఆనేక మంది విజయవాడలో బిట్ బ్యాంక్ పుస్తకాలు ప్రచురించి పిల్లలకు విక్రయించి ఉపాధి పొందుతున్నారు. దటీజ్ ఆనంద్.

- యం.వి.రామారావు



## గజ్వేల్ నూతన సీఐకి కాంగ్రెస్ యువ నాయకుడు ప్రభాకర్ శుభాకాంక్షలు

గజ్వేల్ : గజ్వేల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను పట్టణ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజురెడ్డి నేతృత్వంలో, లక్ష్మాపూర్ యువజన కాంగ్రెస్ నాయకుడు తీగుళ్ల ప్రభాకర్ సోమవారం సీఐ కార్యాలయంలో రవికుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు రవికుమార్ తనదైన శైలిలో కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసుల పాత్ర కీలకమని, తమ పార్టీ పక్షాన ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.




## 10 పాఠశాలలో 1000 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు

**4 రోజులపాటు పంపిణీ చేస్తాం**

**లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాంబాబు**

భీమవరం : లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసి ప్రసాద్ అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని 3 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందించారు. వారు మాట్లాడుతూ 4 రోజులపాటు 1000 మంది విద్యార్థులకు 10 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. మొదటి రోజు సత్రం బడి, ఎంజిఎం పాఠశాల, పిఎస్ఎం బాలికొన్నత పాఠశాల, 22న మౌలానా అబ్దుల్ కలాం పాఠశాల, చంద్రరావు పాఠశాల, ఆర్ హెచ్ ఆర్ మున్సిపల్ పాఠశాల, 23న కొవ్వాడ, గొల్లలకోడెరు ప్రైమరీ పాఠశాల, 24న చిలుకూరు ఎలిమెంటరీ స్కూల్, మహాదేవపట్నం హైస్కూల్లోని సుమారు 1000 మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యమని అన్నారు.కార్యక్రమం లో లయన్ వబిలిశెట్టి కనక రాజు, నడింపల్లి మహేష్, కనగర్ల విజయ రామకృష్ణ, పరుచూరి నాగేశ్వరావు,కోట్ల నాని,కాగిత వెంకట రమణ, గోపిశెట్టి మురళి, నందమూరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు




## చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్‌కు మార్నింగ్ కాఫీ క్లబ్ సత్కారం

భీమవరం : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రశంసలు పొంది రెండు గిన్నిస్ రికార్డులను సాధించిన కేరళకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్ ను మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, పి. ర్. ఓ. భట్టిప్రోలు శ్రీనివాసరావు,సలహా మండలి సభ్యులు కోట్ల నాని సత్కరించారు. వారు మాట్లాడుతూ లలిత కళలతోనే సామాజిక చైతన్యమని, సృష్టిలో 64 కళలున్నాయని అన్నారు. ప్రతి కళలోనూ ప్రపంచ వ్యాప్తంగా నిష్ణాతులు ఎందరో చరిత్రలో ఉన్నారని, ప్రముఖ చిత్రకారుడు రాజశేఖరన్ పరమేశ్వరన్ ఒకరని అన్నారు. కార్యక్రమంలో ఛాంబర్ అఫ్ కామర్స్ మాజీ కోశాధికారి బొండా కోటిబాబు పాలుగొన్నారు